ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
గురువారం 5 సెప్టెంబరు 2024

విపత్తును ఎదుర్కొనేలా ప్రభుత్వం చర్యలు
8లో..

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి
8లో..

మొదలైన కూల్చివేతలు



బంధంపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన కంపౌండ్ వాల్‌ను కూల్చివేస్తున్న అధికారులు

- బంధంపల్లి చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను తొలగించిన అధికారులు
- సీఎం ఆదేశించిన 24 గంటల్లోనే చర్యలు
- అక్రమార్కుల్లో వణుకు..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

హైదరాబాద్ తరహాలో రాష్ట్రమంతటా హైడ్రాను కొనసాగిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించిన 24 గంటల్లోపే జిల్లాలోనూ కలెక్టర్ కోయ శ్రీహర్ష చర్యలకు ఉపక్రమించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో అక్రమార్కుల వెన్నులో వణుకు మొదలయ్యింది. బుధవారం పెద్దపల్లి పట్టణాన్ని ఆనుకుని ఉన్న బంధంపల్లి చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలు ఉన్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలకు ఉపక్రమించారు. నీటి పారుదల, రెవెన్యూ శాఖాధికారులతో పాటు సర్వే అండ్ ల్యాండ్ అధికారులు కలిసి బంధంపల్లి, పట్టణంలోగల రంగంపల్లి చెరువుల్లో బఫర్ జోన్లలో కట్టడాలు ఉన్నాయని గుర్తించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను మార్కింగ్ చేసిన అధికారులు వాటి లోపల ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయాలని మున్సిపల్ కమిషన్ వెంకటేష్‌కు వివరాలు అందించారు. ఆ మేరకు రంగంలోకి దిగిన మున్సిపల్ కమిషనర్ బంధంపల్లి చెరువు బఫర్‌జోన్‌లో నిర్మించిన కంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడంతో దానిని జేసీబీతో కూల్చి వేశారు. అలాగే ఇద్దరు నిరుపేదలు బఫర్ జోన్‌లో రేకుల షెడ్లు వేసుకోవడంతో ఆ నిర్మాణాలను కూల్చివేయలేదు. వారికి ప్రత్యామ్నాయం చూపిన తర్వాత వాటిని కూడా తొలగించాలని నిర్ణయించారు. మరికొన్ని కట్టడాలు బఫర్ జోన్‌లో ఉన్నా యని భావిస్తున్నారు. మరోసారి వాటిని పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకోవాలని అధికా రులు నిర్ణయించారు. అక్రమ ణలను కూల్చివేయడం ప్రారం భించడంతో అక్రమార్కుల వెన్ను లో వణుకు పుడుతున్నది. జిల్లాలోని చెరువులు, కుంటలు, నాలాల ఆక్ర మణలు, ప్రభుత్వ భూముల ఆక్రమ ణలను గుర్తించి వాటిని తొల గించేందుకు గత నెలలో కలెక్టర్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో రెవెన్యూ, నీటి పారుదల, సర్వే ల్యాండ్ శాఖాధికారులు తదితరులతో ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ సమావేశమై ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో గుర్తించాలని నిర్ణయించింది.

ఆక్రమణలు ఎక్కడైనా ఉంటే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు. ఆ మేరకు పెద్దపల్లి, రామగుండం, మంథని, సుల్తానాబాద్‌లో పలు ఆక్రమణలు ఉన్నట్లుగా కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చి నట్లుగా సమాచారం. హైదరాబాద్‌లో హైడ్రా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణలను కూల్చి వేస్తున్న విషయం తెలిసిందే. ఆ తరహాలో జిల్లాల్లోనూ ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగిం చాలని డిమాండ్ వస్తున్నది. శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలను వరదలు ముంచెత్త డంతో ఇళ్లు నీట మునిగాయి. ఇళ్లల్లోకి బురద వచ్చి చేరింది. తీరని నష్టం వాటిల్లడంతో పాటు పలువురు మృతిచెందారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబాబాద్ జిల్లా ను సందర్శించిన సందర్భంగా హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా నాలాలు, చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామని ప్రకటించారు. ఆ మేరకు జిల్లాలో కలెక్టర్ చర్యలు చేపట్టారు. చెరువు శిఖం భూ ములు ఆక్రమించి గానీ, శిఖంకు ఉండే 30 మీటర్ల బఫర్ జోన్‌లో కట్టడాలు ఉంటే వాటిని తొలగించాలని నిర్ణయిం చారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించి ఎలాంటి నోటీసులు ఇవ్వ కుండానే ఆక్రమణలను తొలగి స్తా మని అధికారులు చెబుతు న్నారు. బంధంపల్లి చెరువు బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలు ప్రారంభం కావడంతో పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఎల్లమ్మ, గుండమ్మ చెరువుల బఫర్ జోన్లలో కూడా అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిని కూడా తొలగించాలని పట్టణ ప్రజలు కొందరు కూల్చివేతల సందర్భంగా అధికారులకు తెలిపారు. రంగంపల్లి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను రెవెన్యూ, నీటి పారుదల, సర్వే అధికారులు గుర్తించారు. ఒకటి, రెండు రోజుల్లో ఎల్లమ్మ, గుండమ్మ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించేందుకు అధికారులు సిద్ధం అవు తున్నారు. జిల్లాలోని పట్టణాలు, మండ లాల్లో ఉన్న అన్ని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చివేయాలని నిర్ణయించారు.



బంధంపల్లి చెరువు శిఖంను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టర్ ఆదేశాలతో..

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 4: హైడ్రా ప్రకంపణలు జిల్లా కేంద్రంలో బుధవారం మొదలయ్యాయి. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఆర్డీవో, ల్యాండ్ సర్వే, జిల్లా ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ శాఖ సంయుక్తంగా బంధంపల్లిలోని చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ వెంచర్ ప్రహరీ గోడను జేసీబీతో తొలిగించారు. అలాగే నిరుపేదలు వేసుకున్న రెండు రేకుల షెడ్లను మాత్రం వదిలిపెట్టారు. వారికి ప్రత్యామ్నాయం చూపిన తర్వాత వాటిని కూడా తొలగించాలని నిర్ణయించారు.



వెంచర్ ప్రహరీని కూల్చివేస్తున్న అధికారులు

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 4:ప్రజాసంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. స్థానిక ఆర్య వైశ్య భవనంలో బుధవారం 173 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు కోటి 73లక్షల 45వేల 97 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో నియోజకవర్గంలో పలు దఫాలుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. ఈనెల 17న రెండో విడత ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం పెద్దఎత్తున చేపడుతోందని, గతంలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే పథకాల్లో కొన్ని అందకపోవడంతో తిరిగి రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరి నుంచి అధికారులే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి దరఖాస్తులు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, మండల మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కళాశాలకు స్థలం కేటాయించాలని మంత్రికి వినతి

మంథని, సెప్టెంబరు 4: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించాలని కోరుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కళాశాల అధ్యాపక బృందం బుధవారం వినతిపత్రం అందజేశారు. కళాశాల ఏర్పాటై ఐదు ఏళ్ళు గడుస్తున్నా అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. భవనం సరిపోక రెండు గ్రూపుల బోధన రద్దయినట్లు తెలిపారు. ఆట స్థలం, కాంపౌండ్ వాల్ లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గెస్ట్ లెక్చరర్లకు పేస్కేల్ ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ జీతం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు శైలజ, అరుణశ్రీ, అనితలు ఉన్నారు.

మారుతినగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 4: గోదావరిఖని మారుతినగర్‌లో సమస్యలు పరిష్కరించాలని 48 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీలావతి ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నీలావతితోపాటు డివిజన్ మహిళలు మాట్లాడుతూ తమ డివిజన్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ తమ డివిజన్‌ను సందర్శించి త్వరలోనే రోడ్ల సమస్య, వీధిదీపాల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారన్నారు. ఎమ్మెల్యే, మేయర్ డివిజన్‌లో సమస్యలను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ అధికారులు కాలనీ సమస్యలను త్వతిగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ కాలనీ వాసులు శశిరేఖ, మల్లమ్మ, పద్మ, కోటయ్య, మొండక్క, కుమార్, సత్తయ్య, విద్యావతి, శారద, సరస్వతి పాల్గొన్నారు.

రామగుండంలో దర్జాగా చెరువుల కబ్జా

- సగానికి కబ్జా అయిన మల్లపురాణి కుంట
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనూ అక్రమంగా అనుమతులు
- వందల సంఖ్యలో భవనాలు, నిర్మాణాలు
- ఇరిగేషన్, రెవెన్యూ ఆధ్వర్యంలో సంయుక్త సర్వేకు ప్రభుత్వ ఆదేశం
- సీఎం ప్రకటనతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

కోల్‌సిటీ, సెప్టెంబరు 4: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో చెరువులు, కుంటలు దర్జాగా కబ్జా అవుతున్నాయి. సర్వే నెంబర్లు మార్చి చెరువులు, కుంటలకు సంబంధించి స్థలాలను ప్రైవేట్ స్థలాలుగా చూపుతూ విక్రయాలు సాగించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని స్థలాల్లో లే అవుట్లు వేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో రామగుండం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ 'రేటు' పెట్టి అనుమతులు ఇస్తోంది. ఒక్కో నిర్మాణానికి రూ.లక్ష వరకు చేతులు మారుతున్నట్టు ప్రచారం ఉంది. టౌన్‌ప్లానింగ్ యథేచ్ఛగా అనుమతులు ఇవ్వడంతో నిర్మాణదారులు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోసి ఎత్తులు పెంచి నిర్మాణాలు చేస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో 14కుంటలు, చెరువులు ఉన్నాయి. ఇందులో నగరం నడబొడ్డున, రాజీవ్ రహదారి పక్కనే ఉన్న మల్లపు రాణికుంట సగానికి కబ్జాకు గురైంది. శిఖం,ఎఫ్‌టీఎల్‌లలో యథేచ్ఛగా నిర్మాణాలు వెలిశాయి. బఫర్ జోన్‌ను పరిగణలోకి తీసుకున్న పరిస్థితే లేదు. మల్లపు రాణి కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో వందల సంఖ్యలో నిర్మాణాలు వెలిశాయి. అందులో భారీ బహుళ అంతస్థుల భవనాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రామగుండం, మల్యాలపల్లి, జనగామ, మల్కాపూర్, మేడిపల్లి, అల్లూరు చెరువులు ఉన్నాయి. రామగుండం పెద్దచెరువు సర్వే నంబరు 412లో 189.13 ఎకరాల్లో ఉంది. మల్యాలపల్లిలోని మంచినీళ్ల కుంట సర్వేనంబరు 210లో 6.15ఎకరాలు, మీది కుంట సర్వే నంబరు 178లో 10.24ఎకరాలు ఉంది. జనగామ ఊర చెరువు సర్వే నంబరు 245, 246, 247, 248, 358 ల్లో 177.57ఎకరాలు, కుమ్మరికుంట సర్వే నంబరు 788 లో 12.13 ఎకరాలుగా ఉంది. మల్కాపూర్ ఊరకుంట సర్వే నంబరు 213లో 15.38ఎకరాలు, మల్లపురాణి కుంట సర్వే నంబరు 173లో 26.01ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మేడిపల్లిలో నాలుగు చెరువులు ఉన్నాయి. పెద్ద చెరువు 73.39ఎకరాలు, మంగళి కుంట సర్వే నంబరు 618లో 13.07ఎకరాలు, పెరకవాణి కుంట సర్వే నంబరు 595లో 12.12ఎకరాలు, కర్నాలకుంట సర్వే నంబరు 232లో 4.12ఎకరాలు ఉంది. అల్లూరు ఊరచెరువు సర్వే నంబరు 143లో 39.3ఎకరాల్లో ఉంది. ఇవేకాకుండా జనగామ వడ్లకుంట, వీర్లపల్లి కుంటలు కూడా ఉన్నాయి.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై దృష్టి

మున్సిపల్ బిల్డింగ్ రూల్స్‌ల్లో చెరువులు, కుంటలు, నదులు, నాలాలకు సంబంధించి హద్దులు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్‌లపై స్పష్టతనిచ్చారు. నదులకు సంబంధించి ఇరిగేషన్‌శాఖ నదికి నిర్దేశించి హద్దు నుంచి మున్సిపాలిటీల్లో అయితే 50మీటర్లు, ఇతర ఏరియాల్లో అయితే 100మీటర్లుగా బఫర్ జోన్‌గా తీసుకుంటారు. సరస్సులు, కుంటలు, చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్ తరువాత 30మీటర్లు బఫర్ జోన్‌గా తీసుకుంటారు. ఇందులో 10హెక్టార్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న చెరువులు, కుంటలకు 30మీటర్లు బఫర్ జోన్, 10హెక్టార్లలోపు విస్తీర్ణం ఉన్నచెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నుంచి 9మీటర్లు బఫర్ జోన్ తీసుకుంటారు. అలాగే 10మీటర్ల వెడల్పు ఉన్న నాలాలకు 9 మీటర్ల బఫర్ జోన్ ఉంటుంది. హైదరాబాద్‌లో హైడ్రా నేపథ్యంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో చెరువులు, కుంటలు, నాలలకు ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్‌లు నిర్దేశించాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్‌శాఖ సంయుక్తంగా సర్వే జరుపాలని ప్రభుత్వం ఆదేశించింది.

మల్లపురాణి కుంటలో కబ్జాలు

రామగుండం నగరం మధ్యలో ఉన్న మల్లపు రాణి కుంట కబ్జాలకు గురైంది. రాజీవ్ రహదారి పక్కనే పోలీస్ కమిషనరేట్ ముందున్న ఈ కుంట విస్తీర్ణమే కుదించుకుపోయింది. సర్వే నంబరు 173లో 26.01 ఎకరాలు(10.53హెక్టార్లు)లలో ఈ కుంట ఉంది. కుంటకు ప్రస్తుత చంద్రబాబుకాలనీ, శారదానగర్, ఎన్‌టీపీసీ టౌన్‌షిప్, ఖాజిపల్లి, రామగుండం పోలీస్ కమిషనరేట్, సోలార్ ప్లాంట్ ప్రాంతాలు క్యాచ్‌మెంట్ ఏరియాగా ఉన్నాయి. రెవెన్యూ నక్షలో చంద్రబాబుకాలనీ, టీచర్స్ కాలనీ, శారదానగర్ వైపు నుంచి ఒర్రెలు ఉన్నాయి. రాజీవ్‌రహదారి సమీపం వరకు గతంలో దీని ఎఫ్‌టీఎల్ ఉండేది. గత రెండు సంవత్సరాల భారీ వర్షాలతో అక్కడి వరకు నీరు చేరింది. చెరువు విస్తీర్ణం, శిఖంలో ప్రశాంత్‌నగర్, శ్రీనగర్‌కాలనీ వైపు నిర్మాణాలు వెలిశాయి. ఈ చెరువుపక్కనే సర్వే నంబరు 171, 172 ప్రాంతాలు ఎఫ్‌టీఎల్‌లో ఉండేవి. కొన్నేళ్లుగా మల్లపురాణి కుంట ఎఫ్‌టీఎల్‌లో మట్టిపోసి విక్రయాలు జరిపారు. ఈ కుంటకు సంబంధించి రాజీవ్ రహదారి, శ్రీనగర్ కాలనీ రహదారి దగ్గరి వరకు బఫర్ జోన్ ఉంది. కానీ మున్సిపల్ నిబంధనలు పట్టించుకోకుండా టౌన్ ప్లానింగ్ అనుమతులు ఇచ్చుకుంటూ వస్తుంది. కొన్నేళ్లుగా ఎఫ్‌టీఎల్‌లోనే అనుమతులు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి. పైగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలకు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



గోదావరిఖనిలోని మల్లపురాణి కుంట

తేలని అడ్డగుంటపల్లి చెరువు వివాదం..

గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన కొందరు పట్టాదారులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం కొన్ని దశాబ్దాల క్రితం చెరువును నిర్మించుకున్నారు. 40 నుంచి 50ఎకరాల్లో చెరువు ఉండేదని, దాని కింద భూములు సాగయ్యేవని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న శ్రీనివాస, ఊర్వశి థియేటర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతాలు పొలాలుగా ఉండేవి. రెవెన్యూ రికార్డుకు మూలమైన షేత్వార్‌లో మాత్రం అడ్డగుంటపల్లి చెరువుగా చెప్పబడుతున్న అమీనుద్దీన్ పేర 12.15 ఎకరాలు, సర్వే నంబరు632లో 11.08ఎకరాలు పట్టాభూమి ఉంది. నక్షలో మాత్రం చెరువుగా చూపారు. ఈ చెరువు వివాదంలో ఇరిగేషన్‌శాఖ అడ్డగుంటపల్లి చెరువు తమ రికార్డుల్లో లేదని పేర్కొన్నది. దీంతో నిర్మా ణ అనుమతులు ఇవ్వడంతో భవనాలు వెలిశాయి. కాగా కొన్ని ఫిర్యాదులతో అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం..

హైడ్రా తరహాలో చెరువులు, కుంటలు, నాలా పరిరక్షణకు జిల్లాలో సైతం వ్యవస్థను రూపొందించుకోవాలని, ఆక్రమణలు తొలగించాలంటూ ముఖ్యమంత్రి ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కార్పొరేషన్ పరిధిలోని కుంటలు, చెరువులకు ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్‌లు నిర్ణయించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.






మల్లపురాణి కుంట సమీపంలో ఉన్న నిర్మాణాలు

కలెక్టరేట్ ఎదుట గురుకుల సిబ్బంది ధర్నా



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా సేవలందిస్తున్న తమను ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి తప్పించడంతో బుధవారం జిల్లా కేంద్రంలో వారు ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. అలాగే అధికారుల మనసు మార్చి తమను విధుల్లో కొనసాగేలా చేయాలని పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెద్దపల్లి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అరవింద్, సురేష్, రమేష్, శ్రీనివాస్, రవీందర్, ఆనంద్, లింగయ్య, రామకృష్ణారెడ్డి, ఏ. శ్రీనివాస్, రాజమౌళి, సంతోష్, ధర్మాచారి, ఎం.శ్రీనివాస్, దేవదాసు, రాజేష్, అనిల్, లింగయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 42మంది ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఈనెల 5న నిర్వహించే వేడుకల్లో 42మంది ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి డి.మాధవి బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే వేడుకలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీవో

మంథని, సెప్టెంబరు 4: మున్సిపల్ పరిధిలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆర్డీవో హనుమానాయక్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను, విద్యార్థులకు ఇస్తున్న భోజనాన్ని, పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాల అవరణను, బాత్‌రూంలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



ఎంపీడీవో కార్యాలయంలో పెచ్చులూడిన పైకప్పు

పెచ్చులూడుతున్న ఎంపీడీవో కార్యాలయం పైకప్పు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 : పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం పైకప్పు పెచ్చులూడుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడల ద్వారా లీకై గదుల్లో ఉరుస్తున్నాయి. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని కార్యాలయ సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో భద్రపరిచిన పలు రికార్డులు సైతం లీకేజీ నీటితో తడుస్తున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రతి ఏటా వర్షకాలం వచ్చిందంటే కార్యాలయంలోని సిబ్బంది అంతా భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం నిర్మించి చాలా ఏళ్లు కావస్తున్నా మరమ్మతులు చేపట్టని పరిస్థితి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే మరమ్మత్తులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి
అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.
పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్దంగా ఉంటారు
కరీంనగర్ : 99854 79333
మానకొండూర్ : 63026 28816
హుజురాబాద్ : 98492 64461
జమ్మికుంట : 98499 55462
ACM : 99854 11274
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్



ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం

మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ ఆలీ బేగ్


పనులను పరిశీలిస్తున్న కమిషనర్


సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4: సిరిసిల్ల పట్టణ పరిధి వార్డులలోని ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు మొలచి దోమలు పెరుగుతున్నాయని ఫిర్యాదు లు వస్తున్నాయని, ఆ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తు న్నామని మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ ఆలీ బేగ్ అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొత్త చెరువు నుంచి వరద ప్రవాహంతో కలిగిన సమస్యలపై దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు బుధవారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్, శ్రీనగర్ కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్త చెరువు వరద ప్రవాహంతో కాలనీ వాసులకు కొంత ఇబ్బంది కలగడం వాస్తవమైనా కొత్త చెరువు నీటిని ఒకే సారి వదలకుండా కొద్ది కొద్దిగా వదులుతున్నట్లు చెప్పారు. శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలో నీటి నిల్వలు ఉన్నట్లుగా గుర్తించి జేసీబీ సహాయంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నవాటిని తొలగించామన్నారు. డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ వేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీలు, చెట్ల పొదలను తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగం పేరిట రూ.6.98 లక్షల టోకరా

జమ్మికుంట, సెప్టెంబరు 4: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన వి శృతికి స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన గుర్తు తెలియని వ్యక్తి ఫ్లిప్‌కార్ట్‌లో ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి పలు మార్లు లక్షల రూపాయలు కాజేశాడు. ఫ్లిప్‌కార్ట్‌లోని వస్తువులకు మెసెజ్, లైక్ చేస్తే డబ్బులు వస్తాయని, అందుకు ముందుగా కొంత పెట్టుబడి పెట్టాలని నమ్మించాడు. గత నెల 27నుంచి ఈ నెల 3వ తేదీ వరకు పలు విడుతల్లో రూ.6.98లక్షలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించారు. తర్వాత ఫోన్ చేస్తే అవతలి వ్యక్తి నుంచి స్పందన కరువైంది. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి ఇసుకలోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను హౌసింగ్‌బోర్డు కాలనీ బైపాస్‌రోడ్‌లో పట్టుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



పెద్దాపూర్ గురుకులానికి తిరిగి వస్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు ఇరవై రోజుల తరువాత విద్యార్థులు తిరిగి వస్తున్నారు. బుధవారం తిరిగి పునః ప్రారంభించిన గురుకులానికి ఇంటర్, పదో తరగతి విద్యార్థులు తరలి వచ్చారు. గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు రావడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. గురుకులంలోని పాఠశాలలో 410 మంది, కళాశాలలో 130 మంది మొత్తం 540 విద్యార్థులు చదువుకుంటున్నారు. గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందగా మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు క్లాస్‌లను నిర్వహించారు.

పాఠశాలలో జరిగిన సంఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించారు. గురుకులం అభివృద్ధికి కట్టుబడి ఉందని తక్షణమే రూ. 50లక్షలను నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాఠశాలలోని విద్యార్థులకు కావల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలోకి విద్యార్థులకు కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు, కావల్సిన మరమ్మతులను చేయించారు. ఉన్నత అధికారుల సూచనల మేరకు పదో తరగతి, ఇంటర్‌మీడియట్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ కోసం నేరుగా పాఠాలను నేర్పడానికి బుధవారం నుంచి గురుకుల పాఠశాల తరగతులను పునఃప్రారంభించారు. మరో వారం లోగా పూర్తిస్థాయిలో అన్ని తరగతులను ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. గురుకులంలో విద్యార్థులకు కావాల్సిన వసతుల తరువాత ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు తిరిగి పాఠశాలకు వస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.


గురుకుల పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులు

ఎస్సీ గురుకుల కార్యదర్శిని తొలగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్వేరోస్ ప్రతినిధులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 4: ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే తొలగించాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మాతంగి మారుతి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. బ్రహ్మకుమారి అనే ఆధ్యాత్మిక సంస్థ ద్వారా విద్యార్థులకు మానసిక తరగతులను నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నారని, దానిని రద్దు చేసి సీనియర్ సైకాలజిస్టులచేత తరగతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, స్పోర్ట్స్ అకాడమిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో పిల్లలకు హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, గురుకులాలకు పక్కాభవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోష్కి కుమార్, ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి రజిత, జాయింట్ సెక్రెటరీ కవ్వంపెల్లి విఘ్నేష్ పాల్గొన్నారు.

కొచ్చెరువు మత్తడి ధ్వంసం

వృథాగా పోతున్న నీరు

కథలాపూర్, సెప్టెంబరు 4: మండలంలోని కొచ్చెరువు మత్తడి ధ్వంసం కావడంతో బుధవారం చెరువు నుంచి నీరు వృథాగా పోతోంది. గతంలోనే మత్తడి ధ్వంసం కాగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పైభాగంలో ఉన్న అడవుల్లోంచి పుష్కలంగా నీరు వస్తుండంతో వరద ప్రవాహం పెరిగింది. దీంతో గతానికి మించి మరికొంత మత్తడి ధ్వంసం కావడంతో నీరు కిందికి వృథాగా పోతోంది. మత్తడి మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ వర్షాకాలం ప్రారంభం కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.


గంభీర్‌పూర్‌లో ధ్వంసమైన కొచ్చెరువు మత్తడి





నిండుకుండల్లా ప్రాజెక్టులు

● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
● 18 టీఎంసీలు దాటిన ఎల్ఎండీ

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,75,692	3,55,524	80.5	70.425
ఎల్లంపల్లి	3,39,782	2,40,262	20.175	13.667
మిడ్ మానేరు	19,017	9,850	27.54	21.766
ఎల్ఎండీ	20,840	283	24.034	18.589
ఎగువమానేరు	27,500	------	2.00	2.00


జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,75,692 క్యూసెక్కుల నీరు వస్తుంటే...41 గేట్లు పైకి ఎత్తి దిగువకు 3,55,524 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 19 వేల క్యూసెక్కులు వరద కాలువకు, నాలుగు వేల క్యూసెక్కులు కాకతీయ కాలువకు, నాలుగు వేల క్యూసెక్కులు ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ తయారీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు... ప్రస్తుతం 70.425 టీఎంసీల నీరు ఉంది. మహారాష్ట్రలోని నాసిక్, నాందేడ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తోంది. గోదావరి నదిపై ఉన్న విష్ణుపురి ప్రాజెక్టు నిండింది. బాలేగావ్ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తడంతో పాటు దాదాపు 1.8 లక్షల క్యూసెక్కుల మేర వరద దిగువకు వస్తోంది. కామారెడ్డి జిల్లాలోని మంజీర, నిజామాబాద్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతం, నిర్మల్ జిల్లాలోని గడ్డెన్న వాగు నుంచి మరో 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

● శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

పెద్దపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)/అంతర్గాం: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 3,39,782 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 22 గేట్ల ద్వారా 2,40,262 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.667 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

● మిడ్ మానేరు ప్రాజెక్టు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలకు మానేరు, మూల వాగు ఎస్సారెస్పీ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 19,017 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు ద్వారా 2,405 ఎస్సారెస్పీ నుంచి 10,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ఎల్ఎండి ప్రాజెక్టుకు రెండు గేట్ల ద్వారా 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 21.766 టీఎంసీల మేరకు ఉంది.



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు



ఎల్ఎండీలో నీరు

● నిండుతున్న ఎల్ఎండీ

తిమ్మాపూర్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోని భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ఇన్‌ఫ్లోతో ఎల్ఎండీ పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో కుంటలు, చెరువులు అన్ని నిండి మత్తడి దూకుతున్న నీరు మోయతుమ్మెద వాగులోకి వచ్చి చేరుతోంది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ నుంచి ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీలోకి బుధవారం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మోయతుమ్మెద వాగు నుంచి 33,856 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 3,300 క్యూసెక్కులు, ఎగువ ప్రాంత్రం నుంచి 1,831 క్యూసెక్కులు, మొత్తం 25,285 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి వచ్చి చేరుతోంది. ఔట్‌ఫ్లో 287 క్యూసెక్కులు ఉంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలకు ప్రస్తుతం 18.074 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 22 టీఎంసీలకు చేరుకుంటే ఎల్ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

పరివాహక ప్రాంతాలకు హెచ్చరిక

లోయర్ మానేరు డ్యామ్ ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. పోలీసు శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు.నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెలు వెళ్లకుండా, చేపలు పట్టేవారు, గొర్రెల కాపరులు, రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. దిగువ పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య

● వివాహం అయిన 18 రోజులకే ఘటన
● ఈ లోకంలో ఉండడం ఇష్టం లేకే అని చేతిపై రాత



భాగ్యలక్ష్మి (ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 4: పెళ్లి అయిన నెల రోజులు కూడా గడవక ముందే ఓ నవవధువు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన కనుక భాగ్యలక్ష్మి (25)కి పక్క గ్రామం మ్యాడంపల్లికి చెందిన తడగొండ ఉదయ్‌కిరణ్‌తో గత నెల 18న వివాహం జరిగింది. ఉదయ్‌కిరణ్ హైదరాబాద్ లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండడంతో వివాహం అనంతరం హైదరాబాద్ వెళ్లారు. భాగ్యలక్ష్మిని తల్లిదండ్రులు మంగళవారం తక్కళ్లపల్లికి తీసుకువచ్చారు. బుధవారం భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు పనుల నిమిత్తం మల్యాల వెళ్లారు. దీంతో ఇంట్లో భాగ్యలక్ష్మి ఒక్కరే ఉండగా మధ్యాహ్నం వచ్చిన వాళ్ల తల్లి బాత్‌రూంకు వెళ్లేసరికి బాత్ రూంలో చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై నరేశ్‌కుమార్ సంఘట స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా మృతురాలి చేతిపై 'తాను ఎవరి కారణం వల్ల చనిపోవడం లేదని, నన్ను ఎవరూ ఏమీ అనలేదని, నాకే ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదని అందుకే వెళ్లిపోతున్నా.. అని రాసి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పవర్‌లూం క్లస్టర్‌తో నేత కార్మికులకు ప్రయోజనం

● యారన్ సబ్సిడీ 80 శాతానికి పెంచాలి ● నేత కార్మికులకు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలి
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ● కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వినతి

సిరిసిల్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గిరిరాజ్‌సింగ్‌ను సన్మానించారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేయాలని, యారన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. యారన్ సబ్సిడీని 80 శాతానికి పెంచాలని, పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా యంత్రాల ఆధునికీకరణతో పాటు ఉత్పాదకతను కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంచుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. యారన్ డిపోతో ముడిసరుకులు సులభంగా, తక్కువ ధరకు లభిస్తాయని వివరించారు. యారన్ సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని కోరారు. టెక్స్‌టైల్ శాఖ మంత్రి పవర్‌లూం క్లస్టర్ యారన్ డిపో మంజూరుపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని వివరించారు.



కేంద్ర చేనేత జౌళిశాఖ మంత్రిని సన్మానిస్తున్న బండి సంజయ్

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4: మద్యం తాగి వాహనం నడిపిన రంగాపూర్‌కు చెందిన వేములవాడ మహేష్ అనే యువకుడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం జగిత్యాల న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. మద్యం తాగి మహేష్ వాహనం నడపడంతో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం కేసు నమోదు చేసి సంబంధిత కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనదారుల అజాగ్రత్త చర్యల వల్ల అవతలి వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారకు. వారి కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం వాహనదారులకు సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

దొంగతనం కేసుల్లో ముగ్గురికి జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 4: జిల్లాలోని వివిధ చోట్ల దొంగతనం చేసిన కామారెడ్డి జిల్లా బతుకమ్మకుంటకు చెందిన వెంకల్‌వాడ మారుతి, ఇందిరానగర్‌కు చెందిన మండల సాయికుమార్‌లకు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వీరిద్దరు దొంగలు ఫిబ్రవరి 19, 2023న సిరిసిల్ల పట్టణంలోని మల్లికార్జున వైన్స్‌లో , కార్తికేయ వైన్స్‌లలో చోరీకి పాల్పడ్డారని, మార్చి 13, 2023న సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో గల దత్తునాయక్ ఇంటి ఎదుట పార్క్‌చేసిన ద్విచక్రవాహనం , అదే రోజు ప్రశాంత్‌కు ఇంట్లో చోరీకి పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఈకేసుల్లో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున సందీప్ వాదనలు వినిపించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్థులకు ఒక ఏడాది కఠినకారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

ఇదేవిధంగా మరో వాహన చోరీ కేసులో గంభీరావుపేటకు చెందిన అంకం రాజు అనే వ్యక్తికి ఏడునెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఆయన తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారెవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. అయిదు కేసులలో శిక్షలు పడడంలో కృషిచేసిన పిపి సందీప్, సిఎంఎస్ ఎస్ఐ రవీంద్రనాయకుడు, కోర్టు కానిస్టేబుల్ నరేశ్‌ను ఎస్పీ అభినందించారు.

నిప్పు అంటించుకొని ఒకరి ఆత్మహత్య

తిమ్మాపూర్, సెప్టెంబరు4: మండలంలోని ఇందిరానగర్ గ్రామ శివారులో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్‌పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండి ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న సత్తు రఘు(48) కరీంనగర్‌లోని శ్వేత హోటల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటి నుండి బయలుదేరి ఇందిరానగర్ గ్రామ శివారులో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు, పూర్తి వివరాలు తెలియల్సిఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

మల్యాలలో రేషన్ దుకాణాల తనిఖీ

మల్యాల, సెప్టెంబరు 4: రేషన్‌బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా అపోహపడవద్దని, రేషన్‌బియ్యంలోనే అనేక పోషక పదార్థాలు ఉంటాయని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి కృష్ణ అన్నారు. మల్యాలలోని పలు రేషన్ దుకాణాలను నాణ్యత ప్రమాణాల అధికారి రసీద్ ఇతర అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో బియ్యం నాణ్యత పరిశీలించారు. రేషన్ లబ్ధిదారులతో మాట్లాడారు. నాయబ్ తహసీల్దార్ బి శ్రీనివాస్, బీఎస్ స్వామి, వంశీ తదితరులు ఉన్నారు.

మద్దులపల్లిలో జాలరి అదృశ్యం



బాబు (ఫైల్)

పెగడపల్లి, సెప్టెంబరు 4: పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నెబోయిన బాబు (52) అనే జాలరి మంగళవారం సాయంత్రం నుంచి అదృశ్యమయినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు గ్రామ శివారులోని చెరువు మత్తడి వద్దకు చేపలు పట్టేందుకని వెళ్లాడని, తిరిగి ఇంటికి రాలేదన్నారు. బాబు భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,550 చొప్పున పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, సెప్టెంబరు 4: మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులపై నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ రఘుచందర్ బుధవారం విచారణ జరిపారు. బల్వంతాపూర్‌కు చెందిన రమేష్, సురేశ్ అనే వ్యక్తులపై ఇదే గ్రామానికి చెందిన తోడేటి బాబు అనే వ్యక్తి కారు డబ్బుల విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మూడురోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా డీఎస్పీ బల్వంతాపూర్‌లో విచారణ జరిపారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మూడేళ్ల బాలుడు హర్షిత్ విష జ్వరంతో మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటలోని తుడుం రవళి-అజయ్ దంపతుల కుమారుడు హర్షిత్‌కు నాలుగు రోజుల కిందట జ్వరం రావడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.. పరిస్థితి విషమంగా మారడంతో అదేరోజు వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటిలేటర్ సౌకర్యం లేకపోవడం వల్ల తమ కొడుకుకు మెరుగైన వైద్యం అందకుండాపోయిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములు, నర్సింలు, బాలరాజుయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపిక



ప్రమోదకుమార్



పద్మావతి

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 4: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తత్వాది ప్రమోదకుమార్ ఈ ఏడాది ఉత్తమ రాష్ట్ర అధ్యాపక పురస్కారానికి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ తెలిపారు. సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరబాద్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో జన్మించిన ప్రమోదకుమార్ పీహెచ్‌డీ పూర్తిచేసి, 1998 నుంచి అధ్యాపక వృత్తిలో కొన సాగుతున్నారన్నారు. ఓవైపు అధ్యాపక వృత్తిలో రాణిస్తూనే, మరోవైపు తెలుగు సాహిత్యంలో రచనలు చేస్తున్నారని, ప్రమోదకుమార్ అనువదించిన కన్నడ కథలు, చతుర, విపుల, వార్త, ఆంధ్రజ్యోతి, స్రవంతి మొదలైన వార పత్రికల్లో ప్రచురితం అయ్యిందన్నారు. రచనలతో పాటు సెమినార్‌లో పాల్గొని దాదాపు 30కిపైగా పత్ర సమర్పణలు చేశారన్నారు. 2013-14, 2014-15 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియేట్ తెలుగు పాఠ్యప్రణాళిక సంపాదకమండలి సభ్యుడిగా, కోర్స్ రైటర్‌గా పనిచేశారన్నారు. ప్రమోదకుమార్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎన్నికవడంపై సహచర అధ్యాపకులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

గణేశ్‌నగర్ : రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి శాతవాహన యూనివర్సిటీ సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పద్మావతి ఎంపికైనట్లు యూని వర్సిటీ అధికారులు తెలిపారు. గురువారం హైదరాబా ద్‌లోని రవీంద్ర భారతిలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

చిగురుమామిడి, సెప్టెంబరు 4: చిగురుమామిడి మండలంలోని నవాబ్‌పేటలో కక్కెర్ల శ్రీహన్సిని అనేక బాలికపై కుక్కలు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో శ్రీహన్సిని కుక్కలు వెంబడించి గాయపరిచాయి. దాంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటని అధికారులు నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలను జాతీయ విపత్తుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్రమంతటా వరద ఉధృతితో అతలాకుతలం అయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రులు, సభ్యులు నష్టాన్ని పరిశీలించారన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన ప్రజలను, మత్స్యకారులను ఆదుకున్నది లేదన్నారు. బీర్‌పూర్ మండలం రోళ్లవాగు వరదతో పంటపొలాల్లో ఇసుక మేటలు వేసి కోట్ల రూపాయలు పంట నష్టం వాటిల్లితే, పైసా నష్టపరిహారం గత ప్రభుత్వం నుంచి అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాయమందిస్తే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారనేది ప్రతిపక్ష నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రతిపక్షం అంటే విమర్శలు చేయడం కాదనే విషయాన్ని గుర్తెరుగాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా పర్యటించకపోవడం, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం విచారకరం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ పర్యటన రద్దుచేసుకొని, సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సింది పోయి, విమర్శలు చేయడం సరికాదని అదే వేదికగా సలహాలు, సూచనలు ఇవ్వాలని హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వరదల ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో వరదల ప్రభావం 10వేల కోట్ల వరకు నష్టం ఉంటుందని, అందులో నుంచి కనీసం రూ.5వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటు రూపంలో విడుదలకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవచూపాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో చెరువులు, నాళాలు అక్రమణకు అడ్డుకట్టవేసేందుకు తీసుకువచ్చిన హైడ్రాతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల్లో కూడా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించడం శుభపరిణామం అన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, మాజీ చైర్మెన్ గిరినాగభూషణం, ఫ్లోర్‌లీడర్ దుర్గయ్య, బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, మాజీ ఎంపీపీలు మహేష్, ధర రమేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, మాజీ ఎంపీటీసీ రాధాకిషన్ రావు తదితరులున్నారు.

అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

● ఒకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 4: తమ గ్రామానికి చెందిన వ్యక్తి తనను చెంపపై కొట్టాడని అవమానం భరించలేక సూసైడ్ నోట్ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మ్యాడంపల్లిలో జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మ్యాడంపల్లికి చెందిన తరాల లచ్చయ్య(48) అనే వ్యక్తి బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలంలో మృతికి ముందు సుసైడ్ నోట్ రాసి పెట్టాడు. గ్రామానికి చెందిన గీకుడు నారాయణ అనే వ్యక్తి తన చెంపపై కొట్టాడని దీంతో తాను గ్రామంలో అవమానం భరించలేనని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. దీంతో నారాయణపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ బైక్ ఢీ .. ఒకరికి గాయాలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 4: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన సుగ్లాంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సుగ్లాంపల్లి - నారాయణపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వెలుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ లారీ కిందకు దూసుకుపోయింది, బైక్ నడుపుతున్న మంచిర్యాల జిల్లా తాల్లపల్లి సింగాపూర్‌కు చెందిన అన్నం సాయితేజ తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరగడంతోనే లారీని వదిలి లారీ డ్రైవర్ పారిపోయాడు.

శిథిల ఆవాసాలలో.. సమస్యలతో సహవాసం

● వర్షం వస్తే సెలవులే ● తాటిపల్లి గురుకులంలో విద్యార్థుల ఇబ్బందులు




అసౌకర్యాల మధ్య విద్యార్థులు పడుకునే గది



తలుపులు లేని తరగతి గదులు

మల్యాల, సెప్టెంబరు 4: మల్యాల మండలంలోని తాటిపల్లి బాలికల గురుకులంలో పాఠశాల, ఇంటర్ విద్యార్థినులు శిథిల భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. సరైన వసతి, సౌకర్యాలు లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. సౌకర్యాలు లేకపోవడంతో వర్షాలు కురిస్తే పాఠశాలకు సెలవులు ప్రకటిస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల పట్టింపు లేని వైనంతో విద్యార్థులు ఏళ్లుగా అసౌకర్యానికి గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల తాటిపల్లి గురుకులానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. శిథిల భవనాలు, అసౌకర్యాలను పట్టించుకోకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థులు పడుకునే గదుల రేకులకు చిల్లులు పడి ఉన్నాయి. కొన్ని తరగతి గదుల్లోనూ అదే పరిస్థితి నెలకొనగా తలుపులు కూడా ఊడిపోతున్నాయి. శిథిల భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు సెలవులు ప్రకటించడాన్ని బట్టి ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 4: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం సాయంత్రం వేగంగా కొనసాగింది. కొన్ని రోజుల నుంచి గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రాజెక్టులోకి 13,092 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన ఐదు గేట్లు తెరచి 28,635 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. గోదావరి నీటి మట్టం పెరిగింది.

నేడు మండలంలో కలెక్టర్ పర్యటన

ఓదెల, సెప్టెంబరు 4 : మండలంలోని కనగర్తి, మడక, ఓదెలలో గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించనున్నట్లు ఎంపీడీవో తిరుపతి తెలిపారు. ఓదెల మండలానికి ఉదయం 9.30 గంటలకు కనగర్తి, మడకలో పర్యటించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులంతా అందుబాటులో ఉండాలని తెలిపారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ప్రభారిగా నరహరి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4: బీజేపీ ఎస్సీ మోర్చా మంచిర్యాల జిల్లా ప్రభారిగా గోదావరిఖనికి చెందిన జక్కుల నరహరిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండ శ్రీధర్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. మంచిర్యాల జిల్లాలో షెడ్యూల్డ్ కులాల వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వారికి అమలు కావాల్సిన పథకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన పరిశీలన

పాలకుర్తి, సెప్టెంబరు 4: మండలం పరిధిలోని పుట్నూర్ కస్తూర్బా బాలికల పాఠశాల, జయ్యారం ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహాలను బుధవారం మండల ప్రత్యేకాధికారి శివయ్య, ఎంపీడివో పొల్సాని శశికళ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మంథని, సెప్టెంబరు 4: పట్టణంలోని పెంజేరుకట్టలో ఇటీవల టెక్కేగారి రత్తమ్మ మృతిచెందగా ఆమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. రత్తమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, కుమార్‌లు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4: మండలంలోని కిష్టంపేటలో సాగర్ల సదయ్యకు చెందిన ఇల్లు వర్షాల కారణంగా కూలింది. దీంతో ఇంటిలో ఉన్న వస్తువులు, బియ్యం తడిసిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని సదయ్య కోరాడు.

విద్యార్థులకు అవగాహన..

సుల్తానాబాద్, సెప్టెంబర్ 4: నిత్యం సమాజంలో జరిగే విషయాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లోని స్కూల్‌లో బుధవారం కూరగాయల మార్కెట్‌లో జరిగే క్రయవిక్రయాల గురించి విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో వేసిన రైతుబజార్ సెట్‌లో పిల్లలు కూరగాయల అమ్మకాలు కొనుగోలు చేశారు.

మానసిక వికలాంగులకు అన్నదానం

సుల్తానాబాద్, సెప్టెంబరు 4: సుల్తానాబాద్ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రలోని వికలాంగులకు సుంక భాగ్యలక్ష్మి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుంక శ్రీలీల శ్రీశైలం, సరిత, శివకుమార్, మహేష్, వాసవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4: ప్రస్తుత రోజుల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా విద్యార్థులు సైబర్ నేరాలపై తెలుసుకొని పలువురికి అవగాహన కల్పించాలని సైబర్ సెక్యూరిటి బ్యూరో సీఐ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబొంకూరు మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై చైతన్యపరిచేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ అట్టెం శంకర్, మరియు ప్రశాంత్, మౌనిక, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

రామగుండంలో నీటి సరఫరాకు ఆటంకం

కోల్‌సిటీ, సెప్టెంబరు 4: మెయిన్ పైప్‌లైన్ లీకేజీ, మరమ్మతులు కొనసాగుతున్న కారణంగా గురువారం రామగుండం నగరంలో నల్లాల ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని నగరకమిషనర్ శ్రీకాంత్ ఒక ప్రకనలో నీటి సరఫరా ఒకరోజు ఆలస్యంగా జరుగుతుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

వరద బాధితులకు అండగా నిలవాలి

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 4: వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని, అవసరమైన సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఇప్టూ జాతీయ సహాయ కార్యదర్శి కే విశ్వనాథ్ ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాని, వేలాది మంది ఇళ్ళు నీట మునిగి తిండికి అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. పంటలు నీట మునిగి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నదన్నారు. ప్రభుత్వాలు అందించే సహాయం కోసం వరద బాధితులు ఎదురు చూస్తున్నారని, వారికి అవసరమైన సహాయాన్ని అందజేయాలన్నారు. యుద్ధప్రాతిపదికన ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేసి రవాణా వ్యవస్థ మెరుగుపరచాలని, ఆయా ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. నిరాశ్రులైన ప్రజలకు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు తోడ్పాటునందించాలని కోరారు.

విపత్తును ఎదుర్కొనేలా ప్రభుత్వం చర్యలు

- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



గోదావరి నదిలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబరు 4:ప్రకృతి విపత్తులను ఎదుర్కోవటానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉన్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథని తీరంలోని గోదావరినదిలో వరద ఉధృతిని మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లోని అధికారులతో ప్రభుత్వపరంగా ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారిని అప్రమత్తం చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదనీటిని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దిగువకు వదులుతున్నారన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మున్సిపల్ పరిధిలో కాలువల్లో మురికినీరు, చెత్తను తొలగించి శుభ్రం చేయాలన్నారు. కురుస్తున్న వర్షాలకారణంగా దోమల ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలితే వెంటనే హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేసి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి వ్యక్తి మెరుగైన వైద్య సేవలందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులతో ఫోన్ మాట్లాడి క్షేత్రస్థాయిలో పంటల నష్టాన్ని పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పాలని, ఎంత మేర పంట నష్టం జరిగిందో చూడాలని ఆదేశించారు. వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

వలస కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

- పెద్దపల్లి కార్మిక శాఖ అధికారి హేమలత



వలస కార్మికుల వివరాలు తెలుసుకుంటున్న లేబర్ ఆఫీసర్ హేమలత

సుల్తానాబాద్, సెప్టెంబరు 4: ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఆయా గోదాముల్లో, రైస్‌మిల్లుల్లో, ఇటుక బట్టీల్లో పని చేస్తున్న సందర్భాల్లో వారికి వసతి సౌకర్యాలు కల్పించాలని పెద్దపల్లి కార్మిక శాఖ అధికారి హేమలత అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్ రైల్వే స్టేషన్ వద్ద గల గోదాములను ఆమె బుధవారం సందర్శించి గత నెలలో చనిపోయిన బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడి వివరాలను సేకరించారు. గోదాములో దాదాపు రెండు వందల మంది ఛత్తీష్‌గడ్, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి సంబంధించిన రికార్డులు కానీ, వలస కార్మికులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కానీ గోదాము నిర్వాహకులు చూపలేదన్నారు. అసలు గోదాము ఓనర్‌షిప్ పత్రాలు కూడా వారివద్ద లేవన్నారు. కాగా, గతనెల 14న బీహార్‌కు చెందిన ఓ కార్మికుడు రాత్రంతా పనిచేసి తన గదిలో పడుకునేందుకు వెళితే అక్కడ ఉక్కపోత భరించలేకి గోదాము ఆవరణలో బియ్యం లోడ్‌తో ఉన్న లారీపైన నిద్రించాడు. నిద్రమత్తులో లారీ పైనుంచి కింద పడి మరుసటి రోజు మృతిచెందాడు. ఈ కేసు విచారణ కోసం లేబర్ ఆఫీసర్ గోదాములో కార్మికుల వివరాలు సేకరించారు. అలాగే వలస కార్మికుల వద్దకు వెళ్లి వారికి కల్పిస్తున్న వసతి సౌకర్యాల గురించి అరా తీశారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను పనిలో పెట్టుకుంటే అందుకు సంబంధించిన రికార్డులు కూడా నిర్వహించాలని కార్మిక శాఖ అధికారి హేమలత గోదాము నిర్వాహకులకు సూచించారు.

నిండుకుండల్లా చెరువులు, కుంటలు

ఓదెల, సెప్టెంబరు 4 : మండలంలోని నాలుగు చెరువులు, ఎనిమిది కుంటలు ప్రమాదస్థాయి వరకు చేరుకున్నాయి. శనివారం నుంచి మంగళవారం వరకు ఉధృతంగా వర్షాలు కురవడంతో పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, గుంపుల, చెరువుల్లోకి వరదలు చేరి నిండుకుండలా మారాయి. వర్షాలు కొంతవరకు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతంలో ఉన్న ఒర్రెలనుంచి, అలాగే పంట పొలాల నుంచే గండ్లుపడి చిన్నచిన్న వరదలు వచ్చి చెరువులు, కుంటల్లోకి చేరుతున్నాయి. దీంతో చెరువు కట్టల మట్టం వరకు నిండాయి. ఒక్కొక్క చెరువు ఆయకట్టుకు 50 నుంచి 80 ఎకరాల వరకు రైతులు పొలాలను సాగు చేశారు. ప్రమాదంగా ఉన్న చెరువు కట్టలు కనుక తెగినట్లయితే వందలాది ఎకరాల్లో వరి పంటలు కొట్టుకపోయే పరిస్థితి నెలకొంది. వెంటనే అధికారులు తేరుకొని చెరువు కట్టలను పరిశీలించి, రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామాల రైతులు కోరుతున్నారు.



పొత్కపల్లిలో నిండిన ఊరచెరువు

మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎల్ఎండీ నుంచి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేస్తున్న దృష్ట్యా మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ యాకయ్య కోరారు. మండలంలోని గుండ్లపల్లి, కనగర్తి, మడక, పొత్కపల్లి రైతులు రూపునారాయణపేట, ఇందుర్తి, బాయమ్మపల్లి గుంపుల గ్రామస్థులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. నీటి ప్రవాహం తగ్గేవరకు చేపల వేటకు, గొర్రెలు, పశువుల మేతకు తీసుకెళ్లవద్దని యాకయ్య కోరారు.

భారీ వర్షాలతో అతలాకుతలం



కల్వర్టును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శివయ్య

పాలకుర్తి,సెప్టెంబర్ 4: నాలుగు రోజుల నుంచి కురుస్తున్నా భారీ వర్షాలకు మండలంలోని జనం అతలాకుతలం అవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని వాగులు,వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు చెరువులు, కుంటలు మత్తళ్లు దూకుతున్నాయి. బసంత్‌నగర్‌లోని మారుతీనగర్‌లో ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో జనం తీవ్రఆందోళనకు గురయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్ పుట్నూర్ గ్రామాల మధ్యలోని పాలవాగు మీద కల్వర్టు తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడ్డది. మండల ప్రత్యేక అధికారి శివయ్య, ఎంపీడీవో పొల్సాని శశికళ సంఘటన స్థలాన్ని సందర్శించారు. త్వరలో మరమ్మతు పనులు చేపడుతామని తెలిపారు. వెంట పంచాయతీ కార్యదర్శి సుమలత, నరేష్ తదితరులున్నారు.

సకాలంలో విద్యుత్ మరమ్మతులు..

బుధవారం తెల్లవారు జాము 4.30 గంటల నుంచి నిరంతరంగా కురిసిన భారీ వర్షాలకు మండలం పరిధిలోని పుట్నూర్, బసంత్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షాల వల్ల పిడుగుపాటుకు 33కేవీ ధర్మారం నుంచి వచ్చే సప్లై, రామగుండం ఆర్‌టీఎస్ బీస్టేషన్ నుంచి వచ్చే సప్లై కూడా ఆగిపోయింది. దీంతో ఏడీఈ రాజ్‌కుమార్, ఏఈ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 4: చదువు మధ్యలో మానేసినవారు, గృహిణిలు దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్యా అడ్మిషన్ల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాకతీయ విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విధానంలో డిగ్రీ, పీజీ కోర్సులను చదివే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారు వివిధ ఉద్యోగాలకు అర్హులుగా పరిగణించబడతారని, పారిశ్రామిక ప్రాంతానికి చెందిన నిరుద్యోగులు, నిత్యం కాలేజీకి వెళ్ళే అవకాశం లేనివారు ఈ కోర్సుల ద్వారా డిగ్రీ పట్టాలు పొందే వీలు ఉన్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలో రామగుండం బీపవర్ హౌస్ ప్రారంభం కానున్నదని, ఈ ప్రాంత యువతకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఈ సందర్భంగా 800 వాట్ల పవర్ ప్లాంట్ సాధించినందుకు గాను డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతినాయక్, కాపంల్లి సతీష్, సుద్దాల శీను, సాగర్, రామకృష్ణ, జెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4 : పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, గురుకుల, సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ జిల్లాకన్వీనర్ బండి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి రాజశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా కనీసం విద్యారంగంపై చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో మద్యానికి మంత్రి ఉండగా, విద్యారంగానికి మంత్రిని కేటాయించలేని దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారిపోయిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులకు ఎదుర్కొన్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి దినేష్, నాయకులు శశాంత్, సాయి చరణ్, శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయంబర్‌మెంట్ స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ పట్టణ ఇన్‌చార్జి పిడుగు సిద్ధార్థ డిమాండ్ చేశారు. బుధవారం ఖనిలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా, విద్యారంగ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. విద్యాశాఖ మంత్రికి నియమించని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం బాధాకరమైన విషయమన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ సైతం విద్యారంగంపై నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చెబుతుండడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అబి, శివ పాల్గొన్నారు.



కోల్ ఇండియా స్థాయి క్రీడల్లో రాణించాలి

- జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎంలు సుధార్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి, సెప్టెంబరు 4: క్రీడాపోటీల్లో కోల్‌ఇండియా స్థాయిలో రాణించాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు అన్నారు. వర్క్‌పీపుల్స్ అండ్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడాపోటీలను బుధవారం రాణిరుద్రమాదేవి కీడా ప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్‌లో ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రారంబించారు. చెస్, క్యారమ్ పోటీలను జీఎంలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమంతో పాటు క్రీడల నిర్వహణకు పెద్దపీట వేస్తూ ఎన్నో సదుపాయాలను కల్పిస్తోందన్నారు. క్రీడాకారులు ఉత్తమ నైపుణ్యంతో పోటీల్లో పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి కీర్తిని చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగేశ్వర్‌రావు, సుదర్శనం, సునీల్‌ప్రసాద్, మతీన్ హుస్సేన్, నరసింహారెడ్డి, నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డితో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

- డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4: జిల్లాలోని భవిత కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిజియోథెరపి డిగ్రీ (బీపీటీ)/ఎంపీటీ విద్యార్హత ఉన్న స్థానికులు అర్హులవుతారని తెలిపారు. క్యాంపు ఒక్కయింటికి రూ.వెయ్యి చొప్పున నిర్వహించే విధంగా అవర్స్‌బేస్‌గా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 7వరకు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి మరియు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు 9246462324 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 4: కరీంనగర్‌లో గత నెల 25న బ్రూస్‌లీ మార్షల్‌ఆర్ట్స్ కుంగ్‌ఫు అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల చెందిన 13 మంది, క్రీసెంట్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురిని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడానికి దోహదపడ్డ మంకీ ఫిస్ట్‌కుంగ్‌ఫు అకాడమీ మాస్టర్ జి.సతీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ శిరీష, క్రీసెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కే మధు పీఈటీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను స్వచ్ఛందంగా కూల్చివేయాలి



ఇళ్లను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 4: రెండు, మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను యజమానుల కూలిచ వేసి సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమత రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌లు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల సూచన మేరకు పెద్దపల్లి పట్టణంలోని 28 వార్డులో, 21 వార్డులో మున్సిపల్ అధికారులు శిథిలావస్థలో ఉన్న మూడు ఇళ్లను గుర్తించి ఎవరికీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా మున్సిపల్ చట్ట ప్రకారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈకార్యక్రమంలో మేనేజర్ శివప్రసాద్ గారు, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీహరి, వినయ్, జూనియర్ అసిస్టెంట్ రమకాంత్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

గ్రామాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

కమాన్‌పూర్, సెప్టెంబరు 4: గ్రామాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు దృష్టి పెట్టాలని ఎంపీడీవో జి.లలిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న గణేష్ ఉత్సవాల్లో ఆ ప్రాంతంలో పరిశుభ్రత ఉంచాలన్నారు. ఎక్కడైనా మురికి కాలువలు ఉన్నచో వెంటనే శుభ్రం చేయించాలన్నారు.

గణేశుల వద్ద విద్యుత్ దీపా లను ఉండేలా చూడాలన్నారు. ప్రతి కాలువలో శానిటేషన్ చేయించా లన్నారు. తాగునీరు, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కాట బాస్కర్, ఈసీ కృష్ణస్వామి, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

సుల్తానాబాద్, సెప్టెంబరు 4: సుల్తానాబాద్ వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు పలువురు రక్తదానం చేశారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదాన శిబిరాన్ని వాసవి క్లబ్ అధ్యక్షులు అక్కినపల్లి సత్యనారాయణ, ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ ఎల్లంకి రాజన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభించి విషజ్వరాలు సోకి పలువురికి రక్తకణాలు తగ్గి, రక్తం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తాము ఈ రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బాధితులు ప్రాణాలు కాపాడాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, క్లబ్ ప్రతినిధులు సంపత్, రమేష్, బాస్కర్, నార్ల శ్రీనివాస్, వెంకన్న,వినయ్, సందీప్, హర్షిత్‌సాయి, చందు, సోమేష్, అరుణ్, మాణికేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు. రక్తదాతలకు పండ్లు పండ్ల రసాలు అందించి వారిని అభినందించారు.

యువకుడిపై దాడి

సుల్తానాబాద్, సెప్టెంబరు 4: సుల్తానాబాద్ పట్టణంలో ఓ యువకుడిపై దాడి జరిగింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలు కాగా సదరు యువకుడిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు, మిత్రుల కథనం ప్రకారం సుల్తానాబాద్ పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన వేముల చంద్రప్రకాశ్ అనే యువకుడిని సుభాష్‌నగర్‌కు చెందిన సోహన్‌రాజ్ అనే యువకుడు ఫోన్ చేసి గతంలో ఉన్న వాటని మర్చిపోయి పార్టీ చేసుకుందామని పిలిచాడు. ఓ గంట పార్టీ అనంతరం పర్సనల్‌గా చంద్రప్రకాశ్‌తో మాట్లాడేది ఉందని గదిలో ఉన్న మిగతా మిత్రులను సోహన్‌రాజ్ బయటకు పంపించాడు. అనంతరం చంద్రప్రకాశ్‌పై తల్వార్‌తో తలపై, ముఖంపై పోట్లు పొడిచాడు. బయట ఉన్న మిత్రులు గది తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా తమపై కూడా సోహన్‌రాజ్ దాడి చేశాడని వారు అన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న చందును వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108లో కరీంనగర్ అస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు అశోక్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు సందర్శించారు. ఈ విషయంపై ఇంకా ఫిర్యాదు రాలేదని, నిందితున్ని పట్టుకుని దర్యాప్తు చేస్తామన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రామగిరి, సెప్టెంబరు 4: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవార పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న సుమలత, శైలజ, నంబయ్య, సంపత్‌రెడ్డిలను మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, కొలిపాక సారయ్య, మేకల మారుతీలు సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శోభన్‌రావు, ఉపాధ్యాయులు సత్యనారయణ, వనజ, సత్యవతి, వెంకటేశం, దేవేందర్, శంకర్, సతీష్, సుధాకర్, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ సత్యం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీంల ఏర్పాటు

మంథని, సెప్టెంబరు 4: మహిళలు, విద్యార్థినుల భద్రత కోసమే ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేకంగా షీటీంలను ఏర్పాటు చేసిందని షీటీం ఇన్‌చార్జి, ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు. స్థానిక కాకతీయ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు షీటీంలు, ఆన్‌లైన్ మోసాల పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం బస్టాండ్, ఇతర ప్రధాన రస్తాల్లో, జన సమీకరణ ప్రాంతాల్లో, కాలేజీల వద్ద షీటీంలు నిరంతరాయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, మహిళలు ఎవరైన వేధింపులకు గురిస్తే 6303923700 నంబర్‌కు కాల్ చేసి సమస్య చెప్పాలని సూచించారు. మహిళలు ప్రమాదాలు, బెదిరింపులకు గురైతే 100 డయల్ చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, షీటీం సిబ్బంది స్నేహలత, సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.